హైదరాబాద్, శుక్రవారం 20 అక్టోబర్ 2023 ntnews.com

# నిరుపేదకు బియ్యం గోస తీరినట్లే



- సన్నబియ్యం హామీతో లక్షలాది కుటుంబాల్లో ఆనందం
- హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో 11.63 లక్షల రేషన్ కార్డులు (41.67 లక్షల మంది)
- నెలకు 25వేల మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): నిరుపేదకు బియ్యం గోస తీరనున్నది. సీఎం కేసీఆర్ తాజా ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా రేషన్ కార్డుపై సన్న బియ్యమే పంపిణీ చేయనున్నట్లు ప్రకటించడంతో పేదల కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతున్నది . కేవలం హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల పరిధుల్లోనే ఒకటీ, రెండు కాదు... ఏకంగా 11.63 లక్షల కుటుంబాల్లోని నలభై లక్షల మందికి పైగా ప్రయోజనం చేకూరనున్నది.

హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో ప్రతి నెలా సుమారు 25వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు. గతంలో ఒక కుటుంబ సభ్యునికి నాలుగు కిలోల చొప్పున ఒక్కో కుటుంబానికి గరిష్ఠంగా 16 కిలోల బియ్యం మాత్రమే పంపిణీ అయ్యేది. కానీ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్కో సభ్యునికి ఆరు కిలోల చొప్పున కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమంది అంటే పరిమితి అనేది లేకుండా పంపిణీ జరుగుతున్నది. ఒక కుటుంబంలో పది మంది ఉంటే ఆరు కిలోల చొప్పున అరవై కిలోల బియ్యం కూడా ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా పరిధిలో 6,39,669 రేషన్ కార్డులు ఉండగా... నెలకు 14,225 మెట్రిక్ టన్నుల ధాన్యం పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 5,24,153 రేషన్ కార్డులు ఉండగా... నెలకు 10,650.124 మెట్రిక్ టన్నుల ధాన్యం పంపిణీ చేస్తున్నారు. ఇలా రెండు జిల్లాల పరిధిలో 11.63 లక్షల రేషన్‌కార్డులపై నెలకు సుమారు 25వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. అంటే ఒక్కో కుటుంబ సభ్యునికి ఆరు కిలోల చొప్పున దాదాపు 41.67 లక్షల మందికి బియ్యాన్ని అందిస్తున్నారు.

## తాజా హామీతో..

సీఎం కేసీఆర్ తాజాగా వెల్లడించిన ఎన్నికల మ్యానిఫెస్టోలో రేషన్‌కార్డులపై (ఫుడ్ సెక్యూరిటీ కార్డులు) సన్నబియ్యం సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. దీని వల్ల రెండు జిల్లాల పరిధిలో ఏకంగా పదకొండు లక్షల కుటుంబాలకు పైగా ప్రయోజనం చేకూరుతుంది. ప్రస్తుతం పంపిణీ అవుతున్న సుమారు 25వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం రానుండటంతో లక్షలాది కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. ఇకపై బయటి మార్కెట్లో సన్న బియ్యం కొనుగోలు బాధ తప్పనుందని కార్డుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### పేదల బతుకుల్లో వెలుగులు



రేషన్‌షాపుల్లో తెల్లకార్డుపై సన్నబియ్యం పంపిణీ చేస్తామని సీఎం కేసీఆర్ సార్ ప్రకటించడం సంతోషంగా ఉన్నది. పేదల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి కేసీఆర్ సార్.. పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు.

– చంద్రకళ, ఖాజగూడ

### మళ్లీ కేసీఆరే సీఎం కావాలి..



సన్నబియ్యం ఇస్తామని సీఎం సార్ చెప్పడం సంతోషంగా ఉన్నది. దొడ్డు బియ్యం అన్నం తినాలంటే ఇబ్బందిగా ఉన్నది. ఆకలి బాధ తట్టుకోలేక నాలుగు ముద్దలు తింటున్నాం. సీఎం కేసీఆర్ రాకముందు ఆ దొడ్డు బియ్యం కూడా సరిపడా ఇచ్చేవారు కాదు. అలాంటిది కేసీఆర్ సార్ సన్నబియ్యం ఇస్తామంటున్నారు. మళ్లీ ఆయనే సీఎం కావాలి.

– నాంపల్లి లక్ష్మి, నామాలగుండు

### పేదల పక్షపాతి



బీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలో రేషన్ కార్డు ఉన్న వారందరికీ రాబోయే రోజుల్లో సన్న బియ్యం ఇస్తామని ప్రకటించడం సంతోషంగా ఉన్నది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రతి కుటుంబానికి 5 లక్షల బీమా పథకాన్ని ప్రకటించి..ప్రజలకు మరింత భరోసా కల్పించారు. కేసీఆర్ సార్ మూడోసారి సీఎం కావడం ఖాయం.

– కె. అశోక్ ముదిరాజ్, రెజిమెంటల్‌బజార్

### అదృష్టంగా భావిస్తున్నాం



కేసీఆర్ సార్‌కు రుణపడి ఉంటాం. దొడ్డు బియ్యంతో వండిన అన్నం పిల్లలు తినడానికి ఇబ్బంది పడేవారు. కానీ తినక తప్పని పరిస్థితులు. ఇప్పుడు సన్న బియ్యం పంపిణీ రాబోతుండటంతో మాకు చాలా సంతోషంగా ఉంది. రేషన్ కార్డుపై సన్నబియ్యం పంపిణీ అనేది గొప్ప విషయం. పండుగలు వచ్చినప్పుడు సన్న బియ్యం కొనుగోలు చేసి ఆ రోజు వంట చేసుకునే వాళ్లం. సన్న బియ్యం రాబోతుండటంతో అదృష్టంగా భావిస్తున్నాం.

– భాగ్యలక్ష్మి, అన్నానగర్

### ఇంటికి పెద్దకొడుకులా..



వృద్ధాప్యంలో ఉన్న వారికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆసరా పింఛన్లను అందించి పెద్ద భరోసా కల్పిస్తున్నది. తల్లిదండ్రులను కొడుకులు పట్టించుకోవడం లేదు. ఆ బాధలను గుర్తించిన సీఎం కేసీఆర్ సార్ ఇంటికి పెద్ద కొడుకులాగా నెల నెలా ఆసరా పింఛన్లు ఇస్తున్నారు. కేసీఆర్ సార్ ఇచ్చే పింఛన్ డబ్బులతో మా ఖర్చులను మేమే తీర్చుకుంటున్నాం. మళ్లీ పింఛన్ డబ్బులను పెంచుతున్నందుకు చాలా సంతోషంగా ఉన్నది. వృద్ధాప్య పింఛన్లతో ఎంతోమంది కష్టాలు తీరుతున్నాయి. ఎవరినీ ఖర్చుల కోసం డబ్బులు ఇవ్వమని అడిగే పనిలేదు.

– ఆకారం అనసూయ హరిజన బస్తీ, మాదన్నపేట

### సీఎం కేసీఆర్ పేదల పాలిట దేవుడు



పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనుకూలంగా సీఎం కేసీఆర్ తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించడం హర్షణీయం. ఏ ప్రభుత్వాలు పేదలను ఇలా ఆదుకోలేదు. సీఎం కేసీఆర్ పేదల పాలిట దేవుడు అని నిరూపించుకున్నారు.

– అబ్దుల్ హమీద్, సఫ్దార్‌నగర్

### సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం



రేషన్ కార్డులు ఉన్న వారు ఇప్పటి వరకు దొడ్డు బియ్యం తింటున్నారు. సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో రేషన్ కార్డుపై సన్నబియ్యం ఇస్తామని చెప్పడం సంతోషకర పరిణామం. పేదల ఇండ్లలో సన్నబియ్యంతో అందరూ కడుపునిండా భోజనాలు చేస్తారు. సన్న బియ్యం పంపిణీ జరిగితే సీఎం కేసీఆర్‌కు ప్రజలు రుణపడి ఉంటారు.

– విజయ్, గుడిమల్కాపూర్

### ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయి..



పేద ప్రజలు సంతోషంగా ఉండేందుకు ఆహార భద్రత పథకంలో సన్నబియ్యం అంజేస్తామని సీఎం కేసీఆర్ సార్ ప్రకటించడం చాలా సంతోషం. సన్న బియ్యం ఇస్తే పేదలకు ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయి. సన్నబియ్యం ఇస్తే అందరూ సంతోషంగా తీసుకుంటారు.

– సి.అలివేలు, యూసుఫ్‌గూడ

### చాలా సంతోషం..



కుటుంబంలో ఎంతమంది సభ్యులుంటే అంతమందికి 6 కిలోల చొప్పున బియ్యం ఇస్తున్నారు. ఎన్నికల్లో గెలిస్తే రేషన్ షాపుల్లో సన్న బియ్యం ఇస్తామని చెప్పడం చాలా సంతోషం. ఎవరు ఏ పని చేసినా కడుపు నిండా భోజనం చేయడానికే. రేషన్ కార్డు మీద సీఎం కేసీఆర్ సారు అందరికీ సన్న బియ్యం అందజేస్తామని ప్రకటించడం సంతోషాన్ని ఇస్తున్నది.

– శాంతమ్మ, ఎల్‌ఎన్‌నగర్

### ఆలోచన గొప్పది..



చిన్న ఉపాధి పనులతో కుటుంబాలను పోషించుకునే పేదలకు పెద్దలు తినే సన్నబియ్యాన్ని ఇస్తానని సీఎం కేసీఆర్ ప్రకటించడం సంతోషకరమైన విషయం. ధరలు ప్రస్తుతానికి రేషన్ దుకాణాల్లో ఇస్తున్న బియ్యానికి బదులు నాణ్యమైన సన్న బియ్యాన్ని అందించి పేద ప్రజల కడుపు నింపే ఆలోచన గొప్పది. సర్కారు పాఠశాలలో పేద పిల్లలకు ఇప్పటికే సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్న సీఎం కేసీఆర్.. ఆ అదృష్టాన్ని పేదలకు కల్పిస్తామడం హర్షించే విషయం.

– రవికుమార్, వివేకానందనగర్

### మూడోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుంటాం..



ప్రజల కష్టా సుఖాలు తెలిసిన వ్యక్తి సీఎం కేసీఆర్ సార్. రేషన్ కార్డుపై దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం పంపిణీ చేయడం ఆర్థికంగా లాభం చేకురుతుంది. దొడ్డు బియ్యం తినేందుకు ఇబ్బందిగా ఉంటున్నది. సన్న బియ్యం పంపిణీ వల్ల ఇంటిల్లిపాది కి సంపూర్ణ ఆరోగ్యం చేకురుతుంది. కారు గుర్తుకు ఓటు వేసి మూడో సారి బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుంటాం.

– ఎం.పద్మ, భగత్ సింగ్ నగర్, చింతల్

### సన్నబియ్యం ప్రకటనతో..



సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో రానున్న రోజుల్లో రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించడం సంతోషంగా ఉంది. ఇప్పటి వరకు దొడ్డు బియ్యం పిల్లలు తినేందుకు అయిష్టపడేవారు.వారి కోసం ప్రత్యేకంగా సన్న బియ్యం కొనుగోలు చేసే వాళ్లం. మేం కొనుగులు చేయకుండా నేరుగా ప్రభుత్వమే సన్నబియ్యం ఇచ్చేందుకు ముందుకు రావడం శుభ పరిణామం.

– రవీందర్‌రెడ్డి, వివేకానందనగర్

### పేదోళ్ల దేవుడు కేసీఆర్



ధనికులతో సమానంగా పేద ప్రజలు ఉండేలా అన్ని రకాల అవకాశాలు కల్పిస్తున్న దేవుడు ముఖ్యమంత్రి కేసీఆర్. పేదోళ్లకు కూడా సన్న బియ్యం ఇస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పడం ఎంతో సంతోషం కలిగింది. మళ్లీ ఆయన అధికారంలోకి వస్తే సన్నబియ్యం అయినా, పింఛన్ల పెంపైనా సాధ్యమవుతుంది.

– పందిరి శశికళ, ఎన్‌ఎఫ్‌సీనగర్





# కారు జోరు.. విపక్షాల బేజారు

## ఎన్నికల సమరంలో టాప్‌గేర్‌లో గులాబీ దళం

### గులాబీ జెండా ఎగురవేయడమే..

నియోజకవర్గాల్లో గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. గులాబీ నేతలంతా కలిసికట్టుగా ప్రచారాన్ని ఉధృతం చేశారు. ప్రతి ఒక్కరినీ అప్యాయంగా పలకరిస్తూ..ఓటు అభ్యర్థిస్తూ.. ముందుకు వెళ్తున్న అభ్యర్థులకు వాడవాడలా, కాలనీల్లో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. స్థానిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల ఆధారంగానే ప్రచారం చేయాలన్న గులాబీ బాస్ కేసీఆర్ ఆదేశాల ప్రకారం.. అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తున్నారు. పదేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలే అస్త్రాలుగా సాగుతూ లబ్ధిదారులు, వారీ కుటుంబాలతో పాటు ప్రజల నుంచి ఆశీర్వాదం పొందుతున్నారు. ఒకవైపు పాదయాత్రలు , మరో వైపు బూత్ లెవల్ ఏజెంట్లతో ప్రత్యేకంగా సమావేశమై భారీ మెజార్టీ లక్ష్యంగా అభ్యర్థులు ప్రచారంలో స్పీడ్‌ను పెంచారు.



అడ్డగుట్టలో ప్రచారం చేస్తున్న సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్



మోండా డివిజన్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు హారతి ఇస్తూ..

- తొలి జాబితాతోనే కాంగ్రెస్ కకావికలం
- బీజేపీలో కొనసాగుతున్న ఎదురుచూపులు
- ఎన్నికల పోరులో వెనకబడిన విపక్షం

సిటీబ్యూరో, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల సమరంలో వార్ వన్ సైడ్ అన్నట్లుగా 'కారు' టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నది. బరిలో నిలిచే అభ్యర్థుల్లో ఎవరో తేల్చక బీజేపీ పార్టీ, ప్రకటించిన తొలి జాబితాతోనే అసంతృప్తి జ్వాలతో కకావికలమవుతున్న కాంగ్రెస్ మరోవైపు ఉంటే....అధికార పార్టీ బీఆర్‌ఎస్ అభ్యర్థులు మాత్రం ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే తొలి దశలో నియోజకవర్గాన్ని చుట్టేసిన గులాబీ అభ్యర్థులు..రెండో విడతలో గడపగడపకు పాదయాత్రలు చేపడుతున్నారు. అసంతృప్తి అనేది లేకుండా అందరూ ఒక్కతాటిపైన కలిసికట్టుగా ప్రచార పర్వాన్ని కొనసాగిస్తూ విపక్ష పార్టీలకు వణుకు పుట్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో గులాబీ ప్రచారం పండగ వాతావరణంలో కొనసాగుతుండగా..బరిలో ప్రతిపక్ష పార్టీ అనేది మచ్చుకైనా కనబడడం లేదు. షెడ్యూల్ వెలువడి 11 రోజులు గడిచినా.. కాంగ్రెస్, బీజేపీ ఎన్నికల పోరులో తడబడుతున్నది. ఈ నేపథ్యంలో ఆ పార్టీలో నెలకొన్న నిస్తేజ పరిస్థితులతో క్యాడర్ అమోమయంలో వెళ్లిపోగా..మరికొందరు గులాబీ కండువా కప్పుకుంటున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ వ్యూహాలకు ప్రతిపక్షాలు కుదేలవుతున్న పరిస్థితి.

### కమలంలో ఎదురుచూపులే..

ఓవైపు బీఆర్‌ఎస్ ప్రచారంలో దూసుకుపోతూ ఏకఛత్రాధిపత్యం చాటుతుంటే... కారు వేగానికి బీజేపీలో ఆశలు చచ్చుబడుతున్నాయి. అభ్యర్థులు, అధికారం దేవుడెరుగు నియోజకవర్గ స్థాయిలో పార్టీ ఎన్నికల కార్యాచరణ, తొలి జాబితానైనా ప్రకటించండి బాబూ అంటూ ..అసహనంతో ఆ పార్టీ నేతలు ఊగిపోతున్నారు. అయితే రాష్ట్ర స్థాయి నేతలు మాత్రం అందుకు భిన్నంగా అభ్యర్థుల ప్రకటనకు సమయం ఉందంటూ.. మరింత జాప్యం చేయడంతో గ్రేటర్ పరిధిలో నేతలు పక్క పార్టీల వైపు చూస్తున్నారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోకు జనాల నుంచి అనూహ్య స్పందన వస్తుంటే.. బీజేపీ రాష్ట్ర స్థాయి నేతలు మాత్రం అభ్యర్థుల జాబితాను ఖరారు చేయడంలో జాప్యం చేస్తున్నారు. కనీసం బూత్ స్థాయి కమిటీల హడావుడి లేదని పలు నియోజకవర్గాల్లోని పలువురు బీజేపీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థి కంటే ముందు కనీసం పార్టీనైనా జనాల్లోకి తీసుకుపోవడంలేదని ఆవేదన చెందుతున్నారు. ఇదే తీరుగా పార్టీ వ్యవహరిస్తే అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లో ఉన్న కొద్దిపాటి బలాన్ని కూడా కోల్పోయే ప్రమాదం ఉందని సొంత పార్టీ నేతలే బాహాటంగా చెప్పుకుంటున్నారు.

### కాంగ్రెస్‌లోనూ..

ఇక.. కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలిచేందుకు వెంగళరావు, సత్యంశ్రీరంగం, నాగిరెడ్డి, గాలి బాలాజీ, పద్మారావు, యుగేంధర్‌రెడ్డితో పాటు పలువురు నేతలు దరఖాస్తులు చేసుకున్నారు. గురువారం బాలానగర్‌లోని సామ్రాట్ ప్రెసిడెన్సీ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పద్మారావు మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తనకు కూకట్‌పల్లి టికెట్ ఇస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఒకవేళ స్థానికులకు కాకుండా స్థానికేతరులకు టికెట్ కేటాయిస్తే కూకట్‌పల్లిలో సామూహిక నామినేషన్లు వేస్తామన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షతన వహించిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు యుగేంధర్ రెడ్డి సైతం స్థానికేతరులకు టికెట్ కేటాయిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

### కూకట్‌పల్లిలో విపక్షం కునుకు..

కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ పార్టీకి కంచుకోటగా మారింది. ఈ నియోజకవర్గంలో ఏ ఎన్నికలు జరిగినా.. బీఆర్‌ఎస్ పార్టీదే సంపూర్ణ ఆధిపత్యం. మరోసారి కూకట్‌పల్లిలో గులాబీ జెండా ఎగరడం ఖాయమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ బీఆర్‌ఎస్ నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసి..హ్యాట్రిక్ కొట్టడమే లక్ష్యంగా కదనరంగంలో మాధవరం కృష్ణారావు దూసుకుపోతున్నారు. షెడ్యూల్ కంటే ముందే పాదయాత్రలతో నియోజకవర్గాన్ని చుట్టేసిన ఆయన.. ప్రజలకు మరింత చేరువయ్యారు. అయితే ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీలో బలమైన అభ్యర్థులు లేక వలస పక్షుల (ప్యారాచ్యూట్) కోసం వెతుకుతున్నారు. బీజేపీలో పన్నాల హరీశ్‌రెడ్డి, మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్, కంచి మహేందర్‌తో పాటు పలువురు నేతలు అవకాశమివ్వాలని అధిష్ఠానం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. కానీ, అధిష్ఠానం నేతలు మాత్రం బయటి వ్యక్తులను బరిలోకి దింపడానికి ఆసక్తి చూపుతున్నట్లు పార్టీలో చర్చ జరుగుతున్నది. గత ఎన్నికల్లో కృష్ణారావుపై పోటీచేసి ఓడిపోయిన కాంతారావు, హరీశ్‌రెడ్డిలో ఒకరికి టికెట్ ఇస్తే మరొకరు సహకరించుకునే పరిస్థితి కనిపించడం లేదు. కొత్తగా పార్టీలో చేరిన రాజేశ్వర్‌రావు, ప్రేమ్‌కుమార్‌కు టికెట్లు ఇస్తే పార్టీ వర్గాలన్నీ దూరంగా ఉండే పరిస్థితి కనిపిస్తున్నది. బయట నుంచి బీజేపీ జాతీయ నేత మురళీధర్ రావు, మరో నేత విజయశాంతి పేర్లు వినబడుతున్నాయి. ఒకవేళ కొత్తవారికి అవకాశం ఇస్తే.. ఈ నేతలంతా మూకుమ్మడిగా దూరమయ్యే పరిస్థితి కనిపిస్తున్నది.



గాంధీభవన్ ఎదుట నిరసన తెలుపుతున్న గోషామహల్ కాంగ్రెస్ నేతలు

### కాంగ్రెస్ బచావో అంటూ..

గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి భగ్గుమంటోంది. నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని స్థానికేతరులకు కేటాయించడంతో టికెట్‌ను ఆశించిన ఆశావహులు గురువారం గాంధీభవన్‌లో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. టీపీసీసీ నాయకులు సుధీర్‌కుమార్ తివారి, వినయ్‌కుమార్ ముదిరాజ్, కన్ను పహిల్వాన్, శ్రీధర్ గౌడ్, సంజయ్ యాదవ్, రణ్‌ధీర్ ఠాకూర్, నర్మదసింగ్ తదితరులు టికెట్ ఆశిస్తూ దరఖాస్తు చేసుకున్నారు. అధిష్ఠానం మాత్రం సునీతా రావు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడంతో ఆశావహులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'న్యాయం చేయండి.. గోషామహల్ బచావో.. కాంగ్రెస్ బచావో.. గోషామహల్ కాంగ్రెస్ టికెట్‌ను స్థానికులకు కేటాయించాలి.. అని ప్లకార్డులను పట్టుకుని నిరసన తెలిపారు.

### వేటు వేసేది వారే.. టికెట్ ఇచ్చేది వారేనా?

వివాదాస్పద వీడియోతో పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. రాజాసింగ్ నగరంలో అశాంతికి ఆజ్యం పోసేలా ఒక వీడియోలో అనుచిత వ్యాఖ్యలు చేయడం... దీనిపై బీజేపీ అధిష్ఠానం స్పందించి, రాజాసింగ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం తెలిసిందే. అయితే ఇన్నాళ్లూ ఈ వ్యవహారంపై ఏ మాత్రం స్పందించని బీజేపీ అధిష్ఠానం.. తాజాగా సస్పెన్షన్ ఎత్తివేతకు యోచిస్తున్నదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు బలాన్ని చేకూర్చేలా గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని ఒక సందర్భంగా మీడియా రాజాసింగ్ సస్పెన్షన్‌ను ప్రస్తావించగా... అది తమ అంతర్గత వ్యవహారంగా అభివర్ణించారు. అంతేకాదు... సస్పెన్షన్ ఎత్తివేస్తే రాజాసింగ్ పోటీలో ఉంటాడంటూ సంకేతాలివ్వడం గమనార్హం. జాబితా సిద్ధం కాగానే చెబుతామని వ్యాఖ్యానించడమంటే ఆ దిశగా అడుగులు పడుతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.